# ఉపాధ్యాయులు మెలకువలు నేర్చుకోవాలి

• డీఈవో జనార్దన్‌రావు

**మానకొండూర్:** కాలనుగుణంగా విద్యార్థులకు మంచి బోధన అందించడానికి ఉపాధ్యాయులు మెలకువలు నేర్చుకోవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. బిల్డింగ్ కెపాసిటీ పోగ్రాం లో భాగంగా శనివారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. మండల విద్యాధికారి మధుసూదనచారిని డీఈవో సన్మానించారు.

**సప్తగిరికాలనీ(కరీంనగర్):** ఉపాధ్యాయులు భాషా, నైపుణ్యాలను పెంచుకోవాలని డీఈవో అన్నారు. పారమిత పాఠశాలలో జరుగుతున్న గంగాధర మండల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణను సందర్శించారు. కోర్స్ డైరెక్టర్, గంగాధర ఎంఈవో ప్రభాకర్ రావు, మండల రిసోర్స్‌పర్సన్‌లు శ్రీను, రాధిక, ప్రశాంత్, శ్యాం కుమార్, మధుచంద్ర, అనిల్, కుమార్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

**చొప్పదండి:** విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసుకోవాలని ఎంఈవో పి.మోహన్ కోరారు. ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమం ఎంఆర్‌సీలో నిర్వహించారు. కార్యక్రమంలో హరిచరణ్, శాంతికిరణ్ కుమార్, సాయన్న, రాజేందర్ కుమార్, కె. రవి, సంజయ్, సునీత, పద్మ పాల్గొన్నారు.

**జమ్మికుంట:** పట్టణంలోని బాలుర పాఠశాలలో ఎంఈవో హేమలత ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు మెరుగైన బోధనపై నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను లక్ష్యంతో బోధించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు శిక్షణ తోడ్పడుతుందన్నారు. శిక్షణ తరగతుల్లో మెరుగైన బోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.


మానకొండూర్: మాట్లాడుతున్న డీఈవో


చొప్పదండిలో ఎంఈవో మోహన్


జమ్మికుంట: శిక్షణ తరగతుల్లో ఎంఈవో హేమలత, ఉపాధ్యాయులు

## క్లుప్తంగా

### కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద విశ్వకర్మ పరిషత్ నాయకులు సన్మాన సభకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఆచార్య రాచమల్ల పున్నమాచార్యుల కృషి ఫలితంగా స్వయం ఉపాధి పనులు చేసుకునే విశ్వకర్మల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ మేరకు 28న హన్మకొండలోని కీర్తి గార్డెన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎన్పీడీసీఎల్ చైర్మన్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సన్మాన సభకు విశ్వకర్మలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరు విజయ్ కుమార్, విశ్వకర్మ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, బాణాల వివేకానంద, పట్టణ మాజీ అధ్యక్షులు రాంపల్లి భిక్షపతి, చల్లూరి రఘు, రావుల భిక్షపతి, పంచకోటి సత్యం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న దాతలు

**రామడుగు:** మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన గుల్లపల్లి అభినయ ఇంటర్‌లో 984 మార్కులు సాధించి ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో దాతలు ముందుకు వచ్చారు. హెల్పింగ్ హాండ్స్ సహకారంతో శనివారం రూ.పదివేలు అందించినట్లు యువజన సంఘం నాయకుడు గజ్జెల అశోక్ తెలిపారు. మూడేళ్ల పాటు రూ.పదిహేను వేల చొప్పున అందజేయడానికి హామీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో తౌటు కిషన్ రెడ్డి, బత్తిని అజయ్, జేరిపోతుల మహేశ్, గజ్జెల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం


మాట్లాడుతున్న శ్రీకాంత్, నాయకులు

**జమ్మికుంట:** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిన్నాల శ్రీకాంత్ హెచ్చరించారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో తిరుగుబాటు మొదలైందని, పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ రూ.కోట్లు సంపాదించినందుకు ప్రజలే బుద్ధి చెప్పారని, సొంత పార్టీని చక్కదిద్దుకోలేని నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై చెడు ప్రచారం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లేనని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఉమ్మడి సందీప్, నాయకులు సింగిరెడ్డి రంజిత్‌రెడ్డి, పట్టణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బిసాడి వంశీ, దేవునూరి వినయ్, అకినపల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఆర్ఎంకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**గన్నేరువరం:** కరీంనగర్ నుంచి మాదాపూర్, గన్నేరువరం మీదుగా పారువెల్ల వరకు నడిచే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు శనివారం వినతి పత్రం ఇచ్చినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, నాయకులు నందికొండ తిరుపతిరెడ్డి, సంగు వేణులు తెలిపారు. జంగపల్లిలో గ్రామంలో చిన్న గొడవ కారణంగా బస్సును ఇతర రూట్లల్లో నడుపుతున్నారని, ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

### సన్మానం



**హుజూరాబాద్:** పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నల్లా నారాయణరెడ్డిని శనివారం వివిధ సంస్థల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అలయన్స్ అధ్యక్షుడు బి మనోజు, ప్రధాన కార్యదర్శి టి.మాధవరావు, పీడీ రాజిరెడ్డి, ఉపాధ్యాయుడు, కె సాధానందం, గౌరీశంకర్, వేల్పుల ప్రభాకర్ శ్రీహరి,కన్నయ్య పాల్గొన్నారు.

## ఎన్‌సీసీతో క్రమశిక్షణ, అంకితభావం


ప్రశంసాపత్రం అందజేస్తున్న సతీశ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు

**హుజూరాబాద్:** మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి ఎన్‌సీసీ అడ్వాన్స్ లీడర్ షిప్ క్యాంప్ శనివారంతో ముగిసింది. 9వ తెలంగాణ బెటాలియన్ కరీంనగర్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఏకే జయంత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కళాశాల సెక్రటరి వొడితెల సతీశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. దేశ రక్షణ యువత చేతుల్లో ఉందని, ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, అంకితభావం ఏర్పడుతుందన్నారు. అనంతరం కమాండెంట్ లెఫ్టినెంట్ ఏకే జయంత మాట్లాడుతూ.. కెడెట్లకు ఎన్నో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, కావాల్సిన నైపుణ్యాలను బోధిస్తామని తెలిపారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న కెడెట్లకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కళాశాల డైరెక్టర్ శంకర్, ఎన్‌సీసీ అధికారి రవీంద్రబాబు, 9వ తెలంగాణ బెటా లియన్ ఏవో లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణ, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, సూర్యప్రసాద్ తదితరులు న్నారు.

## తప్పిన పెనుప్రమాదం

• విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పిడుగుపాటు

**గన్నేరువరం:** మండలంలోని ఖాసీంపేటలో శుక్రవారం అర్ధరాత్రి పిడుగుపాటుకు గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పిడుగు పడినట్లు విద్యుత్ అధికారులు, గ్రామస్తులు తెలిపారు. సబ్‌స్టేషన్‌కు కొద్ది దూరంలో పడటంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. సబ్‌స్టేషన్ కంట్రోల్ రూంలోని ప్యానల్ బోర్డు, రెండు బ్యాటరీలు, చార్జులు, సీటీలు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. విద్యుత్‌శాఖ ఎస్‌సీ రమేష్‌బాబు, డీఈ తిరుపతి శనివారం ప్రమాదాన్ని పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఎల్‌టీ లైన్‌పై పిడుగు పడటంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వెంట ఏఈ ఆంజనేయులు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.


కంట్రోల్ రూంలో ధ్వంసమైన ప్యానల్ బోర్డు

## ఇళ్ల పంపిణీలో అవకతవకలు

• మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**తిమ్మాపూర్:** ఇందిరమ్మ ఇళ్లకు మానకొండూరు నియోజకవర్గంలో 42 వేల మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 3,500 మందికి మంజూరు చేశారని పంపిణీ పారదర్శకంగా జరగలేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. గ్రామసభలు నిర్వహించకుండానే కాంగ్రెస్ కార్యకర్తలకు ఇళ్లను కట్టబెట్టారని ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి శనివారం మాట్లాడారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, కలెక్టర్ నిబంధనలు పాటించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల పేరిట కమీషన్ల దందా నడుస్తోందని, ఓ విలేకరి ఇల్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. పేదలను మోసం చేస్తూ పార్టీ కార్యకర్తలకు ఇళ్లను కట్టబెడుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిజాయితీగా నిరుపేదలకు ఇళ్లు అందించాలని సూచించారు.

## మేధస్సుకు పదును చదరంగం

**కరీంనగర్‌స్పోర్ట్స్:** ప్రస్తుత కాలంలో చిన్నారుల మేధస్సుకు చదరంగం క్రీడ పదును పెడుతుందని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వి.కుమార స్వామి అన్నారు. జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని విశ్వనాథ్ చెస్ అకాడమీలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 11 చదరంగ పోటీల బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెస్ క్రీడకు ప్రస్తుతం క్రేజీ వచ్చిందన్నారు. విశ్వనాథన్ ఆనంద్, అర్జున్ ఎరగైసీ, ప్రజ్ఞానంద, కోనేరు హంపి లాంటి దిగ్గజ క్రీడాకారులను స్ఫూర్తి గా తీసుకొని రాణించాలన్నారు. పోటీల కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారిని ఈనెల 30 నుంచి జూన్ 1 వరకు హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలుర విభాగంలో దీక్షిత్, శివాస్, లిఖిత్ చైతన్య, శివ, బాలికల విభాగంలో లక్షన, ఆరాధ్య, అన్విక నిధి, అద్వైత చౌహాన్‌లు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. అనంతరం విజేతలకు కుమారస్వామి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్బిటర్‌లు శ్రీనివాస్, శివయ్య, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విజేతలతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కుమార స్వామి

## కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం

**కరీంనగర్ కార్పొరేషన్:** కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్సీ ఆమెర్ అలీ ఖాన్ అన్నారు. ప్రభుత్వపరంగా భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో మైనార్టీలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రంలో సమీకృత పాఠశాలలను మరిన్ని పెంచనున్నట్లు చెప్పారు. త్వరలో భర్తీ చేయనున్న ఆరు మంత్రి పదవుల్లో ఒకటి ముస్లిం మైనార్టీకి ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఎండీ తాజొద్దీన్, నాయకులు సమద్ నవాబ్, అక్బర్ అలీ, నేహాల్, అహ్మద్, కమరొద్దీన్, లాయక్ ఖాద్రీ, అబ్దుల్‌రెహమాన్, ఖలీమొద్దిన్, అబ్దుల్ బారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్

## ‘ట్రినిటి’లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

**కరీంనగర్‌రూరల్:** ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం 12 బహుళజాతి కంపెనీల ప్రతినిధుల ఆధ్వర్యంలో బీటెక్, ఎంబీఏ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన 212 మందికి దాసరి మనోహర్‌రెడ్డి నియామకపుపత్రాలు అందించారు. విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటి కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్‌కుమార్, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

## డీపీవో ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో

**మానకొండూర్:** జిల్లా పంచాయతీ అధికారి మానకొండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్నీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీపీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లే అవుట్, బిల్డింగ్ పర్మిషన్లకు సంబంధించి, ఎంపీవో కిరణ్, గ్రామ కార్యదర్శి రేవంత్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి ఏ మొక్కలు నర్సరీలో పెంచారని, సరిపడా మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నాయా అంటూ వివరాలు తెలుసుకున్నారు.

## నియామకం


లింగంపల్లి సమ్మయ్య

**గన్నేరవరం:** రజక సంఘం జిల్లా కార్యదర్శిగా మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి సమ్మయ్య నియామకమయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని సమ్మయ్య తెలిపారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడితో పాటు రాష్ట్ర లీగల్ అడ్వైజర్ లింగంపల్లి నాగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 29న వేలం

**శంకరపట్నం:** మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ భూముల సాగుకు 29న వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో సుధాకర్ ప్రకటనలో తెలిపారు. జూన్1 నుంచి 2026 మే31 వరకు సర్వే నంబర్ 407లోని 38 గుంటల భూమి సాగు చేసుకోవాలనుకునేవారు వేలంలో పాల్గొని రూ.పదివేల దరావత్తు చెల్లించాలని సూచించారు.

## టెండర్లకు ఆహ్వానం

**విద్యానగర్(కరీంనగర్):** కల్లు గీత కార్మికుల ఆర్థిక సంస్థ రాష్ట్రంలోని నమోదిత క్రియాశీల కల్లుగీత కార్మికుల కొరకు నీరా ప్రాసెసింగ్ యూనిట్‌లతో పాటు నీరా కేఫ్, వాణిజ్య దుకాణాలు, బాంకెట్ హాళ్లను లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనిల్ ప్రకాశ్‌కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 27న సాయంత్రం 3.00 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

## నేడు మండల పూజ

**చొప్పదండి:** మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలోని శ్రీసీతారామచంద్ర ఆలయంలో ఆదివారం మండల పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముష్కె వెంక్ రెడ్డి, అర్చకులు కుర్మాచలం రత్నాకర్ తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి మండలం పూర్తయినందున ఉదయం హోమం, కలశాభిషేకం, అష్టోత్తర పూజ, తదితర పూజలు నిర్వహించున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమం విజయవతం చేయాలని కోరారు.

## ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన


ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**చిగురుమామిడి:** మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. రెండు రోజులుగా 17 గ్రామాలకు చెందిన 2644 మంది హాజరు కాగా అధికారులు వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కాగా రూ.రెండు నుంచి రూ.నాలుగు లక్షల వరకు దరఖాస్తు చేసుకున్న యూనిట్లను అధికారులు కుదించారు. యూనిట్ విలువను తగ్గించుకుంటారా అని అడగడంతో చాలా మంది రూ.యాభైవేల నుంచి రూ.లక్ష వరకు తగ్గించుకోవడం విశేషం. జూన్ రెండో తేదీన ఎంపికైన లబ్ధిదారులకు చెక్కులు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో ఎదురుచూస్తున్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం



**గన్నేరువరం:** గన్నేరువరం పెద్ద చెరువు వద్ద కల్వర్టుకు పగుళ్లు ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్ అన్నారు. నాయకులతో కలిసి శనివారం కుంగిన, పగుళ్లు ఏర్పడిన కల్వర్టును పరిశీలించారు. వర్షాకాలంలో చెరువు నిండితే వరద తాకిడికి కల్వర్టు పూర్తిగా ధ్వంసమై ప్రయాణానికి అడ్డంకులు ఏర్పడుతాయని, పెను ప్రమాదం జరుగకముందే సంబంధిత అధికారులు దృష్టి సారించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంట మండల యూత్ అధ్యక్షుడు బోయిని కుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మెరుగు రాము, నాయకులు ఎండీ నదీం, గుడాల సురేష్, తాటికొండ తిరుపతి, గుండా నరహరి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## రైతును పగబట్టిన ప్రకృతి


మృతి చెందిన కాడెడ్లు

**గంగాధర:** ఆ రైతుపై ప్రకృతి పగబట్టింది. రైతుకు చెందిన ఎడ్లపై రెండుసార్లు పిడుగుపడటంతో మృత్యువాతపడ్డాయి. ఇరవై ఏళ్ల క్రితం పశువుల కొట్టంపై పిడుగుపడగా, శనివారం తెల్లవారుజామున మరోసారి పిడుగుపడటంతో పశువులు మృతి చెందాయి. మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేశెట్టి రైతు లక్ష్మీవీరమల్లయ్య కాడెడ్లను వ్యవసాయ పొలం వద్ద కొట్టంలో కట్టేశాడు. శనివారం తెల్లవారు జామున పడిన పిడుగు పాటుకు రూ.ఎనభై వేలు విలువచేసే రెండు ఎడ్లు మృతి చెందాయి. రైతును ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ సర్పంచు జోగు లక్ష్మీరాజం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా బాధితుడిని ఫోన్‌లో పరామర్శించారు. సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించాలని తహసీల్దార్‌కు సూచించారు.

## సంక్షిప్త వార్తలు

● **నిధులు విడుదల చేయాలి**

**హుజూరాబాద్:** దళిత బంధు రెండో విడుత నిధులను వెంటనే విడుదల చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకునే వారికి రూ. ఐదు లక్షలు అందజేసి మిగతా నిధుల విడుదల చేయలేదన్నారు.

● **ముందస్తు అరెస్ట్**

**జమ్మికుంట:** రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలని హుజూరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసేందుకు దళితబంధు సాధన కమిటీ సభ్యులు తరలివెళ్తుండగా పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేశారు.

● **రూ.11 లక్షల విరాళం**

**చిగురుమామిడి:** చిగురుమామిడి శివారులోని పాంబండ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో యాగశాల, గోశాల నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త చిటుమల్ల సుజాత-విశ్వనాథం రూ.11 లక్షల విరాళం అందించారు. శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు.

● **ఏసీపీని కలిసిన నాయకులు**

**జమ్మికుంట:** హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ మాధవిని జమ్మికుంట పట్టణానికి చెందిన సిలువేరు శ్రీకాంత్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**హుజూరాబాద్:** దళిత సంఘాల నాయకులు ఏసీపీ మాధవిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

● **పేకాటరాయుళ్ల అరెస్టు**

**గన్నేరువరం:** మండలంలోని పారువెల్ల గ్రామంలో పేకాట స్థావరంపై శనివారం దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గోపతి రవీందర్ తెలిపారు. వారి నుంచి రూ.25,470 స్వాధీనం చేసుకున్నామని తదుపరి చర్యలు నిమిత్తం గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

● **మద్యం సేవించి వాహనాలు నడపొద్దు**

**జమ్మికుంట:** మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని జమ్మికుంట టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్ పట్టుబడిన 25 మందిని శనివారం హుజూరాబాద్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా జడ్జి రూ.32 వేల జరిమానా విధించారు.

● **షీ టీమ్ పై అవగాహన**

**హుజూరాబాద్ :** కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు కరీంనగర్ షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు షీ టీమ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా అనేక మోసలు జరుగుతున్నాయని, సమస్యలు ఎదురైతే ధైర్యంగా షీ టీంకు ఫిర్యాదు చేయాలన్నారు.

● **గుడుంబా పట్టివేత**

**జమ్మికుంట:** గుడుంబా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రామకృష్ణ శనివారం తెలిపారు. మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో తనిఖీ చేసి మూడు లీటర్ల గుడూంబా సీజ్ చేశామన్నారు.

● **పోలీస్‌స్టేషన్ పక్కనే దొంగతనం**

**శంకరపట్నం:** కేశవపట్నం పోలీస్ స్టేషన్ పక్కన కరీంపేట గ్రామానికి చెందిన కారుకూరి శ్రీనివాస్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవా రం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. దొంగలు షాపు తాళం పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.17 వేల నగదు, ఇతర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు సమాచారం అందించాడు. రూ.నలభై వేలు నష్టపోయానని బాధితుడు వాపోయాడు.

**ఇస్త్రీ చేసిన దుస్తులు చోరీ**

మొలంగూర్ గ్రామంలో తాటిచెర్ల ఎల్లయ్య లాండ్రీ షాపు తాళం పగలగొట్టిన దొంగలు ఇస్త్రీ చేసిన ప్యాంట్, షర్టులు ఎత్తుకెళ్లారు. గతంలో ఇస్త్రీపెట్టెను చోరీ చేయగా శుక్రవారం ఎల్లయ్య ఇస్త్రీపెట్టెను ఇంటికి తీసుకెళ్లగా దొంగలు బట్టలు ఎత్తుకెళ్లారు.

● **సీఐపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు**

**హుజూరాబాద్:** వ్యవసాయ భూమికి సంబంధించిన సమస్యను పరిష్కారించాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఐ పట్టించుకోవడం లేదంటూ శనివారం పట్టణానికి చెందిన కొలిపాక రమేష్ హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. భూ సమస్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవడం లేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

● **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

**శంకరపట్నం:** మండలంలోని గొల్లపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హన్మకొండకు చెందిన బెజ్జం ప్రకాశ్‌కు(66) తీవ్రగాయాలయ్యాయి. ప్రకాశ్, కొడుకు సుధీర్ కారులో వేములవాడ రాజన్నను దర్శనం చేసుకుని శనివారం తిరిగి వస్తుండగా గొల్లపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. బ్లూకోల్ట్స్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

● **గీత కార్మికుడికి..**

**హుజూరాబాద్:** మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడటంతో గాయాలయ్యాయి. బాలగోని రాములు వృత్తిలో భాగంగా కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారడంతో కిందపడ్డాడు. తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**జమ్మికుంట:** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సాయిని రవి, ఎర్రంరెడ్డి సతీష్, దేశినికోటి, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, పూదరి రేణుకశివకుమార్‌గౌడ్, తోట స్వప్న, బొంగోని వీరన్న, మారపల్లి భిక్షపతి, దేశిని సదానందం, దిడ్డి రాము, రమేష్, శ్రీహరి, పాతకాల అనిల్, పంజాల అజయ్‌గౌడ్, మైస మహేందర్, చిన్నింటి నాగేంద్రర్ పాల్గొన్నారు.

**స్పందన అనాథ ఆశ్రమంలో..**

మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమంలో నాయకలు వానరాశి జాన్, అంబాల రాజు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602934, 9951602933, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కరీంనగర్ : శ్రవణ్, ACO - 9948820305
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : రాములు - 9160083195
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899